కథ

# సానుభూతి కూడా ఖరీదే

కొల్లూరి సోమశంకర్

"మేనేజ్‌మెంట్ గుర్తించే లోపే ఈ నిజం చెప్పడం మంచిదా? అసలు నేను నిజంగానే తప్పు చేశానా?" అని చరణ్ తనలో తానే ప్రశ్నించుకున్నాడు.

తను చేసింది తప్పో... కాదో అర్థం కావట్లేదు.

అతనికి ఆందోళనగా ఉంది. ఆఫీసులో సూట్‌కేస్, కిట్ అప్పజెప్పాడు. జరిగిన సంగతెవరికీ చెప్పలేదు. ఇంటికొచ్చేశాడు. ఆఫీసు నుండి ఫోన్లేవీ రాలేదు. చరణ్‌కు టెన్షన్ పెరిగిపోతోంది.

ఏమీ తేల్చుకోలేకపోతున్నాడు. తనకిచ్చిన స్టాకులోంచి వస్తువులు తగ్గాయి. వాటిని సంస్థ కోసం ఉపయోగించినట్లు ఆధారాలేమీ లేవు. ఉద్యోగం ఊడిందంటే రోడ్డున పడటం ఖాయం. పైగా ఈ మధ్యే పెళ్ళయింది. చరణ్‌కు తలనొప్పి మొదలైంది. భార్య ఇచ్చిన కాఫీ తాగుతూ ఆలోచనల్లోకి జారుకున్నాడు.

చరణ్‌ది మధ్యతరగతి కుటుంబం. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. మేనమామ చేసిన ఆర్థిక సహాయంతో ఇంటర్ వరకూ చదవగలిగాడు. బట్టల కొట్లో, పచారీ కొట్లో రెండేళ్ళపాటు పనిచేశాడు. మేనమామ మిత్రుడొకరు సహాయం చేస్తే 'మేల్ హెల్త్ అసిస్టెంట్' పోస్టు కోసం శిక్షణ పొందాడు. ప్రభుత్వోద్యోగం దొరుకుతుందేమోనని కొన్నాళ్ళు వేచిచూశాడు. అమ్మకు వయసు మీదపడుతోంది. మేనమామకు కుటుంబ బాధ్యతలు పెరుగుతున్నాయి. చరణ్ అందరికీ భారమౌతున్నాడు.

ఊరికొచ్చిన ఓ స్వచ్ఛంద సంస్థలో హెల్త్ వర్కర్‌గా ఉద్యోగం చేశాడు. ఒక ఏడాది గడిచిపోయింది. చరణ్ ఫస్ట్ ఎయిడ్ ఇవ్వడంలో నైపుణ్యం సంపాదించాడు. కానీ ఆ సంస్థవారు ఆఫీసు మూసేశారు. ఆ సంస్థ యజమానికి చరణ్ పనితీరు బాగా నచ్చి ఒక విజిటింగ్ కార్డిచ్చారు. హైదరాబాదులోని ఒక వ్యక్తిని కలుసుకోమన్నారు.

తన బయోడేటా కాపీలు తీసుకుని హైదరాబాదుకు చేరాడు. ఆయన చరణ్‌ను తనకు తెలిసిన వారి వద్దకు పంపారు. వారు వెంటనే ఉద్యోగమివ్వక పోయినా 'మళ్లీ కలవండి' అనేవారు. ఇలా ఆర్నెల్లు గడిచిపోయాయి. తెచ్చుకున్న డబ్బులైపోయాయి. మావయ్యనడగాలంటే సిగ్గుగా ఉంది. అతనిలో నిస్పృహ పెరిగిపోయింది.



ఈ తరుణంలో నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రి 'ఎమర్జెన్సీ సర్వీసుల' తమ టోల్ - ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే ఏ సమయంలోనైనా అత్యవసరమైన వైద్య సేవలందిస్తామని ప్రకటించింది. అవసరమైన వారు ఆ నెంబరుకు ఫోన్ చేసిన వెంటనే సుశిక్షితులైన సిబ్బంది మోపెడ్‌పై సంఘటనా స్థలానికొచ్చి ప్రథమ చికిత్స చేస్తుంటారు. ఈ లోపల అన్ని పరికరాలూ ఉన్న అంబులెన్సు వచ్చి గాయపడిన వారిని తమ హాస్పటల్‌కు తీసుకువెడుతుంది.

ఇలా మోపెడ్‌పై తిరిగే పదిమందిలో ఒకరిగా చరణ్ ఎంపికయ్యాడు.

"హమ్మయ్య... పర్వాలేదు. జీవితంలో కాస్త స్థిరపడ్డాను" అని అనుకున్నాడు చరణ్. మరదలిని పెళ్లి చేసుకుని, మల్కాజ్‌గిరిలో కాపురం పెట్టాడు. అంతా సాఫీగా సాగిపోతుందనుకుంటున్న తరుణంలో...

ఒక యాక్సిడెంట్ కేసుకు హాజరయ్యాడు చరణ్. గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేశాడు. తమ అంబులెన్సు రాగానే ఆసుపత్రికి పంపాడు. తన షిఫ్టు ముగిసింది. డ్యూటీ హాండోవర్ చేసి ఇంటికి బయలుదేరాడు. ఇంతలో రోడ్డు మీద వేగంగా వెడుతున్న ఓ యువకుడి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ యువకుడికి దెబ్బలు తగిలాయి. చరణ్ వెంటనే తన బండాపాడు. సూట్‌కేస్ కిట్‌లోని మందులతో ఆ యువకుడికి 'ఫస్ట్ ఎయిడ్' చేశాడు. కాలికి చిన్న దెబ్బలే తగిలాయి. కానీ చేతికి మాత్రం ఫ్రాక్చరైనట్లు గ్రహించాడు.

"మీకు సిమెంటు కట్టుకట్టాలి. మా అంబులెన్సుకు ఫోన్ చేస్తాను. మా ఆసుపత్రికెళదాం" అన్నాడు చరణ్.

"వద్దండీ. మా ఆఫీసు వాళ్ళు హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తారు. మా పానెల్ హాస్పటలుంది. అక్కడైతే డబ్బు కట్టక్కర్లేదు. ఫస్ట్ ఎయిడ్ చేసినందుకు చాలా థాంక్స్" అంటూ చరణ్ మొబైల్ ఫోన్ నుంచే ఆ అబ్బాయి తన బంధువుకు ఫోన్ చేసి పిలిపించుకుని వెళ్ళిపోయాడా యువకుడు. చరణ్ చూస్తుండిపోయాడు. బండి నడుపుతూ ఆలోచించసాగాడు.

"కేసు ఆసుపత్రికి రాలేదు. కాబట్టి ఫస్ట్ ఎయిడ్‌కైన ఖర్చు నన్నే పెట్టుకోమంటారేమో? ఒక కేసు పోగొట్టాననే మెమో ఇచ్చి జీతం కట్ చేస్తారేమో? మొత్తానికే ఉద్యోగంలోంచి తీసేస్తారేమో?" ఇలాంటి ఆలోచనలు చరణ్‌లో భయాన్ని కలిగించాయి. ఈ విషయాన్ని ఆఫీసులో చెప్పాలో వద్దో తేల్చుకోలేకపోతున్నాడు. ఇంతలో సెల్‌ఫోన్ మోగింది. హాస్పటల్ నుంచేమో అనుకున్నాడు. రాంగ్ నెంబర్.

తను చేసింది సరైందో కాదో తేల్చుకోలేకపోతున్నాడు చరణ్. వృత్తి ధర్మం ప్రకారం తప్పే. అధికారులకు తెలీకుండా ఆఫీసు వస్తువులు వాడటం, వాటి లెక్కలు చెప్పలేకపోవడం నిస్సందేహంగా నేరమే. కానీ మానవతా ధర్మం ప్రకారం తను చేసింది నూటికి నూరుపాళ్లు సక్రమమే.

వాళ్ళమ్మ గారు నూరిపోసిన 'ధర్మో రక్షతి రక్షితః' అన్న వాక్యాన్ని గుర్తు చేసుకున్నాడు చరణ్. సంగతంతా భార్యకు చెప్పాడు.

"అనవసరంగా బెంగ పడకండి. మీరు మంచి పనేచేశారు. అయినా కచ్చితంగా జరుగుతుందో లేదో తెలియని ప్రమాదం గురించి భయపడకండి" అంటూ ధైర్యం చెప్పిందామె. సంగతంతా ఆఫీసులో చెప్పేసి, అవసరమైతే డబ్బులను తన జీతంలోంచి కట్ చేసుకోమని చెప్పాలని నిశ్చయించుకున్నాడు చరణ్. ఇప్పుడతని మనసు కుదుటపడింది.

సామాజిక సేవలు ప్రైవేటీకరణాఘాతం పరమయ్యాక పక్కవాడి గురించి కన్నీళ్లు కార్చాల్సివచ్చినా అందుకు ఖరీదు లెక్క వేసుకుని ఎవరికి వారే భరించుకోవడమంటే ఇదేనేమో...